శ్రీకాకుళం వార్త
శుక్రవారం 12 ఆగస్టు 2022

## ఎగువ సంకిలిగూడలో ఏనుగులు..భయాందోళనలో గిరిజనులు



**సీతంపేట, ప్రభాతవార్త ఆగస్టు 11 :**
మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలోని ఎగువ సంకిలిగూడ గ్రామ సమీపంలో గజరాజులు సంచరిస్తున్నాయి. గురువారం వేకువజాము ప్రాంతంలో నాలుగు ఏనుగుల గుంపు గ్రామ సమీపంలోకి ప్రవేశించి పెద్దపెద్ద ఘీంకారాలు చేసాయని గ్రామ గిరిజనులు వాపోయారు. అక్కడి నుండి సమీపంలోని కొండ పైకి వెళ్లి అరటి మొక్కలను నాశనం చేసినట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేసారు. గడచిన కొంత కాలంగా ఏనుగులు అలజడి లేకపోవడం మూలంగా ఎంతో హాయిగా జీవించామని, మరలా ఏనుగులు తమ గ్రామ సమీపంలో ప్రత్యక్షమవ్వడంతో భీతిల్లుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేసారు. ఏనుగులను ఈ ప్రాంతం నుండి తరలించాలని వారు కోరారు.

## ఉత్సాహంగా విద్యార్థుల మెగా ర్యాలీ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో మెగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ర్యాలీ కొనసాగింది. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ లావణ్య ర్యాలీ ప్రారంభించారు. అన్ని పాఠశాలలు వారి పాఠశాలల నుంచి బస్టాండ్ వరకు చేరుకుని అక్కడ నుంచి మానవహారాన్ని నిర్వహించి ఉత్సాహంగా సమైక్యతను చాటుతూ ర్యాలీ నిర్వహించారు. స్వర్ణభారతి పాఠశాల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ దక్కతకృష్ణ మూర్తిరెడ్డి, వెంకటేశ్వర స్కూల్ చైర్మన్ జి.ఢిల్లేసు, నీలకంఠేశ్వర స్కూల్ చైర్మన్ గిన్ని వెంకటరమణ, వినాయక విద్యానికేతన్ చైర్మన్ కృష్ణమూర్తి, సత్యసాయి స్కూల్ కరస్పాండెంట్ ఎస్.కృష్ణమూర్తి, శారదాస్కూల్ కె.రామారావు, తదితరులు ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. బస్టాండ్ వద్ద సిఐ సతీష్‌కుమార్, రూరల్ ఎస్సై హైమావతిలు సంఘీభావం తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బుద్దాల నిర్మలారెడ్డి స్వర్ణభారతి, సత్యసాయి పాఠశాలల విద్యార్థులకు సంఘీభావం తెలిపారు.

## రాజాంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



**రాజాం, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
రాజాంలో ఆజాదికా అమృత్ మహోత్సవాలు ఊరూరా వేడుకగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలు ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు గురువారం జాతీయ పతాకాలను ప్రదర్శించారు. రాజాం నగరంలో పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ వీరుల త్యాగాలను తల్చుకుంటూ నాటి విముక్త పోరాటంలో యోధుల స్ఫూర్తిని, వారిని మరోసారి స్మరించుకుంటూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన వేళ ఆజాదికా అమృత్ మహోత్సవ్ పేరిట ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతైనా అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమానికి రాజాం పురపాలక సంఘం నిర్వాహకులు డిటివి కృష్ణారావు నేతృత్వం వహించారు. ర్యాలీని ప్రభుత్వ మహిళ కాలేజీ, చైతన్య, విద్యాదరి, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, టౌన్ నేత పొట్నూరు లక్ష్మణరావు, రాజాం పురపాలక సంఘం కమిషనర్ డిటివి కృష్ణారావు, టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, మండల రెవెన్యూ అధికారి విజయ్ భాస్కర్, జెడ్పీటిసి బండి నరసింహులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, రాజాం పట్టణ ముఖ్య నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### 30 ఏళ్లుగా పని చేస్తున్న

## కళాశీలను తొలగించడం అన్యాయం



**కొత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త**
మండల ప్రధాన వాణిజ్య కేంద్రమైన కొత్తూరులో గల శబరగిరి ట్రేడర్స్‌లో గత 30 సంవత్సరాలుగా కళాశీలుగా పని చేస్తున్న వారిని పని నుంచి తొలగించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ అన్నారు. శభరగిరి ట్రేడర్స్‌ను నూతనంగా నిర్మించిన వారాహి ఎంటర్‌ప్రైజెస్ పారాపురం వద్ద ఏర్పాటు చేసి శ్రమజీవుల మధ్య తగాదాలు పెడుతున్న యాజమాన్యంపై అధికార యంత్రాంగం మరియు కార్మిక శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వారాహి ఎంటర్ ప్రైజెస్‌లో గత 30 సంవత్సరాలుగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న కళాశీలను ఇబ్బందులు పెట్టడం దుర్మార్గమని తక్షణమే అధికారులు జోక్యం చేసుకుని కళాశీలుగా పని చేస్తున్న వారందరికీ న్యాయం చేయాలని లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కొప్పల బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దూళి అప్పన్న, బి.త్రినాధరావు, బి.నాగేష్, వంశీప్రసాద్, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శుల సంఘం అధ్యక్షునిగా బోకర



**కోటబొమ్మాళి, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపిడిఓ అధ్యక్షతన మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఎంపిడిఓ కె.ఫణేంద్రకుమార్, ఇన్‌చార్జ్ ఇఓపిఆర్‌డి తులా రాజారావులు కాగా అధ్యక్షులుగా బోకర నరేష్ (సరియాపల్లి), ఉపాధ్యక్షులు విమల్ (కిష్టుపురం) కార్యదర్శిగా, వి.రమేష్ (తర్లిపేట), కోశాధికారిగా ఎన్.ఎన్.చైతన్య, కస్తూరిపాడు సభ్యులుగా ఎస్.శైలజ (పెద్దబమ్మిడి), వెంకటేష్ (చిన్నబమ్మిడి), చాణక్య (చిట్టివలస), బి.సంతోష్ (అక్కయ్యవలస), రునేషా (నారాయణవలస), సిహెచ్.గోపినాయుడు (శ్రీజగన్నాధపురం), పి.రవిశంకర్ (ఎత్తురాళ్లపాడు), వెన్నెల (లకందిడ్డి), శాంతి (నీలంపేట) నూతనంగా ఎన్నుకోబడ్డారు.

## అజాదీకా అమృత్‌మహోత్సవ్ సెల్ఫీబాక్స్ ప్రారంభం



**పాలకొండ, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగరపంచాయతీ పరిధిలో అజాదీకా అమృతమహోత్సవ్‌లో భాగంగా సెల్ఫీబాక్స్‌ను ప్రారంభించారు. గురువారం స్థానిక ఎంఎల్‌ఎ విశ్వా సరాయి కళావతి, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్‌లు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సెల్ఫీబాక్స్ ద్వారా భారతీయులమనే గొప్ప భావన కలుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ సెల్ఫీబాక్స్ ద్వారా త్రివర్ణపతాకంతో సగౌరవంగా భారత గౌరవాన్ని చాటిచెప్పే అనుభూతి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహనరావు, తుమ్మగుంట శంకరరావు, నగరపంచాయతీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌ను కలిసిన ఎంజీఆర్

### – పార్టీ అభివృద్ధికి 5 లక్షల రూపాయలు అందించిన ఎంజీఆర్




**శ్రీకాకుళం, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్‌బాబును గురువారం పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మామిడి గోవిందరావు(ఎంజీఆర్) మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. లోకేష్‌బాబు స్వగృహంలో కలిసిన ఎంజీఆర్ పాతపట్నం నియోజకవర్గం స్థితిగతులు, పార్టీ పరిస్థితులు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి తనవంతు సహాయంగా 5 లక్షల రూపాయలను అందించారు. భవిష్యత్తులో కలిసి పనిచేద్దా బ్రదర్ అని లోకేష్‌బాబు అనడం మరో వైపు యువతకు 40 శాతం సీట్లను కేటాయిస్తామన్న తరుణంలో ఎంజీఆర్ తరచుగా లోకేష్‌బాబును కలుస్తుండడం పాతపట్నం తెలుగుదేశం పార్టీలో సరికొత్త సంకేతాలు వెలువడనున్నాయని పార్టీ వర్గాలు, రాజకీయ విశ్లేషకుల్లో చర్చ మొదలైంది.

## జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ప్రతీ ఇంటికి త్రాగునీరు

### – శాసనసభాపతి తమ్మినేని సీతారాం



**ఆమదాలవలస, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
నీటి లభ్యత వినియోగంపై ప్రతి ఒక్కరూ సంపూర్ణమైన అవగాహనను కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం మండలం మండాది గ్రామంలో సుమారు 21.30 లక్షలు, ఈసర్లపేట గ్రామంలో 8.30 లక్షల రూపాయల విలువ గల జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి పనులకు స్పీకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు ప్రతి ఒక్కరికి అందించడమే తమ ప్రభుత్వం అంతిమ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి గడపగడపకు జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల సద్వినియోగంపై గ్రామీణ ప్రజానీకానికి అవగాహన కల్పించేలా చొరవ చూపాలని సూచించారు. నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే భవిష్యత్తు తరాలు మనుగడ ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి బి.గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పరపతి సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, మండల వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాధం, జి.ప్రభాకరరావు, ఎంపిడిఓ ఎం.రేణుక, కార్యదర్శి బగాది నాగరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ లలితకుమారి, ఎఇ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీదిరి కలిసిన ఎంపీపీ నిమ్మన



**సోంపేట, ఆగస్టు 11 ప్రభాతవార్త**
సోంపేట ఎంపీపీ నిమ్మన దాసు మంత్రి సీదిరి అప్పలరాజును కలిసారు. గురువారం పలాసలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలాస నియోజకవర్గానికి ఎన్నికల పరిశీలకునిగా నియమించడం పట్ల ఆయన మంత్రిని కలిసినట్లు తెలిపారు.

## ఘనంగా ఇంటింటికీ జాతీయజెండా కార్యక్రమం




**శ్రీకాకుళం, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిథిలో 75 సంవత్సరాలు స్వాతంత్ర్య మహోత్సవాలను పురస్కరించుకుని దేశ నలుమూలల నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా త్రివర్ణ పతాకాల ర్యాలీలో ఉత్తరాంధ్ర టిడిపి ఇంచార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పాల్గొన్నారు. పలాస ప్రభుత్వ కళాశాల నుండి కాశీబుగ్గ 3 రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మధ్యలో గల సర్దార్ గౌతు లచ్చన్న, మహాత్మాగాంధీ, అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు అలంకరించి ఘన నివాళి అర్పించారు. ఈ ర్యాలీలో 500 మంది జాతీయ జెండాలను పట్టుకొని దేశభక్తితో నినాదాలు చేస్తూ సాగారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బుద్దా వెంకన్న మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను గుర్తుచేసుకొని గౌరవించడం మన కర్తవ్యమని, శ్రీకాకుళం జిల్లా నుండి ప్రముఖ స్వతంత్ర సమరయోధులు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారు త్యాగాలు అభినందనీయమన్నారు. దేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిన వారిలో ఒకరని గుర్తు చేశారు. గౌతు శిరీష మాట్లాడుతూ ఎంతో మంది త్యాగ ఫలం ఈనాడు మన ఆనందానికి కారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్క స్వాతంత్ర్య సమర యోధులను గుర్తు చేసుకొని గౌరవించడం మన బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టిడిపి జిల్లా అధ్యక్షులు చౌదరి బాబ్జీ, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు శశిభూషణ్, మండల అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, లక్ష్మణ్‌సంతోష్, దుర్యోధన, రుద్రయ్య, మోహనరావు, రమణ, గాలి క్రిష్ణ, రవిశంకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో మాజీ కేంద్రమంత్రి



**సంతబొమ్మాళి, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
మండలంలోని పాలతలగాం సర్పంచ్ నక్కిట్ల అప్పన్న కుమారుని వివాహ వేడుకల్లో గురువారం మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో కృపారాణితో పాటు డాక్టర్ కిల్లి రామ్మోహన్, పిఏసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు (గోవింద్), ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు ఎంపిటిసి సూరాడ రాజారావు, సర్పంచ్ శ్రీరంగం వీరాస్వామి, సర్పంచ్ ప్రతినిధులు పరపటి శ్రీనివాస్‌రెడ్డి, కళింగపట్నం అప్పారావు, పాపారావు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

**రేగిడి, ఆగస్టు 11 ప్రభాతవార్త**
రెండు బైకులు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని రేగిడి 108 సిబ్బంది తెలిపారు. రేగిడి 108 సిబ్బంది ఇఎంటి మీసాల ఈశ్వరరావు, పైలెట్ కొన్న పవన్‌కుమార్‌లు తెలిపిన వివరాలు ప్రకారం రేగిడి ఆమదాలవలస మండల మజ్జిరాయుడుపేట గ్రామ సమీపంలో ఆవు అడ్డంగా రావడం వలన పక్కపక్కనే వెళ్తున్న రెండు బైకులు ఢీకొన్నాయని తునివాడ గ్రామానికి చెందిన ఉదయాన దుర్గారావుకు కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. అటుగా వెళ్తున్న వ్యక్తులు 108కి సమాచారం ఇవ్వడంతో రేగిడి 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇఎంటి మీసాల ఈశ్వరరావు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిఎంఆర్‌కేర్ ఆసుపత్రిలో చేర్చడం జరిగింది.

## రాష్ట్రంలో దొంగలు పడ్డారు

### తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న



**శ్రీకాకుళం, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
రాష్ట్రంలో దొంగల పాలన కొనసాగుతుందని, వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ నుండి మంత్రులు దాకా అందరూ దొంగలేనని తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతు శిరీషతో కలసి విలేకర్లతో మాట్లాడారు. జగన్ ఓ మంచి పనిచేశారని..డాక్టర్‌కి ఆరోగ్య శాఖ ఇవ్వకపోయినా ఓ పసువుకి పశువుల మంత్రి పదవినిచ్చారని, అందుకే సీదిరి ఓ పశువులా మాట్లాడుతూ తన మంత్రి పదవిని కాపాడుకుంటున్నారని అని ఎద్దేవా చేశారు. ప్రజలకు సేవచేసి, పార్టీ జెండా బుజాన వేసుకొని సీదిరి రాజకీయాల్లోకి రాలేదని గుర్తుచేసుకోవాలన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజుకి రాజకీయం అంటే ఏంటో, పదవులకు ఉన్న విలువ తెలియక పశువులా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి అనే సంస్కారం లేకుండా వీధి కుక్కలాగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పలరాజు తిరుపతిలో 150 మందికి విఐపి దర్శనం చేయించారని, దీంతో 15వేల మంది సాధారణ భక్తులు ఇబ్బందులు పడ్డారని తెలియజేశారు. సమరయోధులంతా త్యాగాలు చేసి స్వాతంత్ర్యం సంపాదిస్తే దొంగలంతా మంత్రులయి రాష్ట్రం పరువును తీస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. 75 ఏళ్ల స్వాతంత్రోత్సవాల సందర్భంగా ఈ దొంగలందరికిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌతు శిరీష మాట్లాడుతూ ఇంకోసారి ఏ స్వతంత్ర్య సమరయోధులను అపహేళన చేసిన ఇంటికెల్లి తాట తీస్తానని తీవ్ర హెచ్చరిక హెచ్చరించారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమని రెవెన్యూ రికార్డులు తిరగేసి భూభకాసురులతో తిరిగి కక్కిస్తామని పేర్కొన్నారు. తప్పు చేసిన ఎవర్ని వదిలే ప్రసక్తే లేదని, పోలీసు వ్యవస్థకు ఎవరు బయపడవద్దని ఎవరికి నోటీసులు లేకుండా పిలిస్తే వెల్లవద్దని తెలియజేశారు.

## పథకాలతో గడపగడపలోనూ సంతోషం

### – ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



**వీరఘట్టం, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ ఇంటింటికి తిరిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని రెండవ సచివాలయం పరిధిలోని పలు వీధుల్లో గురువారం పర్యటించి రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని ఇంటింటికి తిరిగి పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా అని ప్రజలకు ప్రశ్నల వర్షాన్ని కురిపించారు. ముఖ్యమంత్రి తమను ప్రజల వద్దకు పంపించారని సమస్యలు ఉన్నాయా అంటూ నేరుగా ఆమెవారిని అడిగి తెలుసుకున్నారు. పథకాల వల్ల ప్రతి కుటుంబం లక్ష నుంచి 5 లక్షల రూపాయల వరకు లబ్ధి పొందుతున్నారి గుర్తు చేశారు. గతంలో టీడీపీ హయాంలో ఏ పని కావాలన్నా కార్యాలయాలకు, మండల నాయకుల చుట్టూ రోజులు తరబడి తిరగాల్సి వచ్చేదని అయినప్పటికీ పనులు జరిగేవి కాదని అన్నారు. జగనన్న సిఎంగా బాధ్యతలు చేపట్టాక సచివాలయ, వలంటీర్‌ల వ్యవస్థను తీసుకు వచ్చి నేరుగా ప్రజల వద్దకే పాలనను తీసుకు వచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటిసి జంపు కన్నతల్లి, వైకాపా పట్టణ శాఖ అధ్యక్షులు దిబ్బ లలిత కుమారి, సర్పంచ్ పి.గౌరమ్మ, వైకాపా నాయకులు, భోగి మణి, శంభాన శ్రీనివాసరావు, దూసి సుధాకర్, కె.అంజనేయులు, జలుమూరు అమర్‌నాథ్, ఇఓ వి.రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాతో ఐతమ్ భారీ ర్యాలీ



**టెక్కలి, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ జెండాతో టెక్కలిలో గురువారం 1500 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. టెక్కలి తహశీల్దార్ బెండి గిరిబాబు, ఐతమ్ చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. టెక్కలి ఆర్‌డిఓకార్యాలయం నుంచి పాతబస్టాండ్ మీదుగా స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు ఈ భారీ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను గుర్తు చేసుకుని భారతమాతకు జై అంటూ పెద్దఎత్తున విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఆర్‌డిఓ కార్యాలయ ఎఓ, ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆర్‌అండ్‌డి డాక్టర్ కె.బి.మధుసాహు, డీన్లు డాక్టర్ డి.విష్ణుమూర్తి, డాక్టర్ డి.ఆజాద్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ బి.వి.రమణ, డాక్టర్ ఎం.జయ మన్మధరావు, పలువురు హెచ్‌ఓడిలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లు, పీడీలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వంట సహాయకురాలిని విధుల నుంచి తొలగింపు

### – 'వార్త' ప్రభావం

**కొత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
మండలంలోని మెట్టూరు ప్రాథమిక పాఠశాలలో వంట సహాయకురాలి నిర్వాకంపై గత నెల 30న జరిగిన సంఘటనపై 'వంట సహాయకురాలి నిర్వాకంపై ఎంఇఓకు ఫిర్యాదు' శీర్షికన వార్త దినపత్రికలో ప్రచురితమైన సంగతి పాఠకులకు విధితమే. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు జరిపిన దర్యాప్తులో పందిరి పార్వతి తీరుపై సమగ్ర నివేదిక అందించడంతో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి నుంచి ఆమెను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు అందినట్లు తెలిసింది. ఇదే విషయమై మండల విద్యాశాఖాధికారి ఎన్.శ్రీనివాసరావును ప్రభాతవార్త వివరణ అడగగా జిల్లా విద్యాశాఖాధికారి నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన పేర్కొన్నారు.

### ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నేడు భారీ ర్యాలీ

**కంచిలి, ఆగస్టు 11 ప్రభాతవార్త :**
మఠం కంచిలి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి చల్లా శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కంచిలి మండలం మఠం కంచిలి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా మండల కార్యాలయం వరకు సుమారు 2వేల మందిచే జాతీయ పతాకాలతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

విజయనగరం వార్త 25

శుక్రవారం, 12 ఆగస్టు 2022 పార్వతీపురం మన్యం

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే



**దత్తిరాజేరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** వైఎస్సార్‌సిపి ప్రభుత్వంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని మరడాం పంచాయతీ పరిధిలో గల మర్రివలస తాడెందొరవలస పంచాయతీ సర్పంచ్‌లు పోతల రామలక్ష్మి, పూడి తిరుపతిరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. కేరళ రాష్ట్రానికి మించి అక్షరాస్య సాధించాలని లక్ష్యంతో ప్రభుత్వ కృషి చేస్తుందని తెలిపారు సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో ఆలోచించి పేదల సొంతింటి కల సాకారం చేయడానికి నిర్ణయించి విషయం గ్రహించాలన్నారు. ఇంటింటికి వెళ్ళి గత మూడేళ్ళలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక ప్రజలు సమస్యలను వింటూ అక్కడక్కడే సంబందిత అధికారులు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి ఆదేశాలు ఇస్తూ ముందుకు సాగారు. అదేవిధంగా ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సిపి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అనంతరం సిఎం జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు ప్రతి ఇంటిలో సంతోషం వెళ్ళి విరస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల సింహాద్రలప్పల నాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్‌నాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ సోమల శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ మంత్రి అప్పల నాయుడు, పోతల శంకరరావు, సుమల గోవిందరెడ్డి, సింహాచలం, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తహశీల్దార్ రమణమ్మ, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బెదిరిస్తున్న పంచాయతీ కార్యదర్శి

**వేపాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త :** నిర్దేశించిన వేళలకు అతీతంగా నిరంతర గ్రామ పారిశుద్యానికి పాటు పడుతున్న మమ్మల్ని అన్యాయంగా తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి మజ్జి గౌరి పదే పదే బెదిరిస్తున్నారని మండల కేంద్రం వేపాడ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు కడారి రామకృష్ణ, కొమ్మనాపల్లి బాలస్వామి, శిగడం కనకరాజు తదితరులు దళిత సేవా సేన జిల్లా అధ్యక్షులు కొమ్మనాపల్లి రవిప్రసాద్ సారథ్యంలో ఎంపిడిఒ పట్నాయక్‌కు గురువారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రావాల్సిన బిల్లులు గౌరవవేతనాలు సకాలంలో అందించకపోగా లంచమందిస్తే బిల్లులిస్తామని చెబుతూ మానసికంగా వేదింపులను ఆమె గురి చేస్తోందని 2019 కరోనా మహమ్మారి నిర్మూలనకు క్వారెంటైన్‌లో మాతో పని చేయించిన కార్యదర్శి మజ్జి గౌరి నేటికీ కరోనా అలవెన్స్‌లు ఇవ్వకుండా దోచేశారన్నారు. ఆ సొమ్ము ఎందుకు ఇవ్వరని అడిగినందుకు బొత్స బాలరాజు అనే గ్రీన్ అంబాసిడర్‌ను ఆమె అన్యాయంగా తొలించిందన్నారు. సిఐటియు సంఘంలో కొనసాగవద్దని చెప్పినట్లు వినకుంటే వచ్చే నెల ఒకటో తేదీ నుంచి విధుల నుంచి తొలగిస్తానని ఫోన్ చేసి బెదిరించారని గ్రీన్ అంబాసిడర్స్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తామంతా నిరుపేద కుటుంబాలకు చెందిన దళితుల మని, విధుల నుంచి అన్యాయంగా తొలగిస్తే వీదిన పడతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సేవ జిల్లా అధ్యక్షులు కొమ్మనాపల్లి రవిప్రసాద్ ఎంపిడితో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల కంటే వేపాడ గ్రీన్ అంబాసిడర్ల పనితీరు ఆమోఘమని వివరించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎంపిడిఒ పట్నాయక్ మాట్లాడుతూ ఎవరిని అన్యాయంగా తొలగించేది లేదని ఫిర్యాదుపై పూర్తి విచారణ జరిపి పంచాయతీ క్యాదర్శిపై చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.



## పురవీధుల్లో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం



**గరివిడి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** అజాద్‌కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం గరివిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం జాతీయ పతాకాన్ని చేతబూని గరివిడి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజల్ని చైతన్య పరిచారు. భారతావనికి లబించిన స్వేచ్ఛను ఈ సందర్భంగా వివరించారు. కాగా గరివిడి ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి పాఠశాల ప్రదనోపాధ్యాయిని బి.లీలాకుమారి అధ్యక్షతన ఇంటింటికి జాతీయ జెండా కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంటు ఆర్గనైజేషన్ శాస్త్రవేత్త ఎస్.ఎల్.ఎన్. రత్నగిరి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకం ఔన్నత్యాన్ని ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరించారు. డిఆర్‌డిఒపై అవగాహన కల్పించారు. ఎన్.ఎస్.టి.ఎల్ సంచాలకులు డాక్టర్ వై.శ్రీనివాసరావు సూచన మేరకు రత్నగిరి పాఠశాలకు 16వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. దేశ వజ్రోత్సవాలు, డిఫెన్స్ అకాడమిపై వక్తలు ప్రసంగించిన అంశాలకు విద్యార్థులు ఆసక్తులయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం లీలాకుమారి, ఉపాధ్యాయులు మీసాల వెంకటరమణ, టి.రామకృష్ణ, ఆర్.లావణ్య, అరుణశ్రీ, ఆర్.శంకర్, ఎ.రవిశంకర్ పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి



**మెరకముడిదాం, ఆగస్టు 11 ప్రభాతవార్త :** మండలంలో గరుగుబిల్లి గ్రామానికి చెందిన ఆవాల వెంకటరమణ (46) గురువారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లగా మృతుడు తన సొంత పొలంలో విద్యుత్ మోటారు వేయడంతో షాక్‌కి గురయ్యాడు. తన సోదరుడు పొలంకి వెళ్ళి చూసేసరికి మృతి చందాడని, మృతునికి భార్య ఇద్దకు కుమారు ఉన్నారు. శవపంచనామ నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వా సుపత్రికి శవాన్ని తరలించారు. బుదరాయవలస ఎస్‌ఐ నవీన్‌పడాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కెల్ల పాఠశాలలో అమృత్ మహోత్సవ్ సన్నాహక కార్యక్రమం



**గుర్ల, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు మండలంలోని కెల్ల ఉన్నత పాఠశాలలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవాన్ని తెలియజేసే విధంగా పాఠశాల మైదానంలో విద్యార్దులను 75 సంఖ్య ఆకారంలో కూర్చుండబెట్టారు. అలాగే డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్నీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.పైడితల్లి పర్యవేక్షణలో ఉపాధ్యాయులు నిర్వహించారు.

## అజాద్‌కా అమృత్ మహోత్సవంలో ర్యాలీ



**బాడంగి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు, పెదపల్లి గ్రామంలో ఆజాద్‌కా అమృత్ మహోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలికి ఎంపిపి, సర్పంచ్, ఎపిఎం, సిసిలు తది తరులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా 13వతేదీన జాతీయ జెండాను ఎగురవేయాలని, 14వతేదీన ప్రతి ఇంటి ముందు త్రివర్ణ పతాకం ముగ్గు వేసుకోవాలని తెలిపారు.

## ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలి



**నెల్లిమర్ల, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని వెలుగు ఎ.పి.ఎం లోపింటి సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు మండలంలోని కొత్తపేట, రామతీర్థం బూరాడపేట, పెదతరిమి గ్రామాల్లో మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఎపిఎం సత్యనారాయణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి కుటుంబం తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కొత్తపేట సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు, రామతీర్థం గ్రామ సర్పంచ్ సూర్యకళ, మాజీ సర్పంచ్ కంచరాపు రాము, ఎపిఎం సత్యనారాయణ, సిసిలు అప్పలనాయుడు, సత్యవతి, శ్రీనివాసరావు, విజయలక్ష్మి, విఓఎలు, మహిళలు హాజరయ్యారు.

## కుటుంబ వైద్యులు అనే భావన అద్భుతం



**శృంగవరపుకోట, ఆగస్టు 11 ప్రభాతవార్త :** వృత్తిపరంగా వైద్యం అందిస్తున్నా, మన కుటుంబం అనే భావనతో వైద్య సిబ్బంది తమ విధులను నిర్వహించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. గురువారం ఎస్.కోట మండల పరిషత కార్యాలయంలో ఈ నెల 15వ తేదీన ప్రవేశ పెడుతున్న కుటుంబ వైద్యుడు భావన గ్రామ సచివాలయ స్థాయిలో వైద్యసేవలు అందించే ఉద్దేశ్యంతో ఈ పథకంపై ముందుగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గడపగడపకు వైద్యసేవలు అందించాలనే ఒక దృఢ నిశ్చయంతో ముఖ్యమంత్రి జగన్ మంచి ఆలోచనతో ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నారన్నారు. సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముఖ్యంగా విద్య, వైద్యంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి ఈ పథకంతో మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రజారోగ్యం పట్ల ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమం సక్రమంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు వైద్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సోమేశ్వర రావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి సుధారాజు, ఎంపిడిఒ ఇఒపిఆర్‌డి ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, రగామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.


## గోరంట్ల చేష్టలకు సీఎం జగన్ సమాధానం చెప్పాలి



**సాలూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరువును పార్లమెంటులో ఎం.పి గొరంట్ల మాధవ్ జుగుప్సాకరమైన చేష్టలతో తీసిన ఇంత వరకు సిఎం ఎటువంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని, దీనికి సమాధానం చెప్పాలని టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యురాలు జి.సంధ్యారాణి ప్రశ్నించారు. గురువారం ఉదయం ఆమె నివాసం వద్ద మాట్లాడుతూ ఈ వీడియో ఘటన జరిగిన తరువాత హోంమంత్రి ఫోరెన్స్‌కు వీడియో పంపించామని చెబితే, దీనిపై కేసు పెట్టకుండా, ఒరిజనల్ లేకుండా ఫోరెనిక్స్‌కు ఎలా పంపుతామన్న ఎస్పీ హాస్యస్పదంగా ఉందన్నారు. గోరంట్ల మాదవ్ ఘటనపై వైఎస్సార్ పార్టీ మహిళా మంత్రులు స్పందించరా అని మహిళా కమిషనర్ నోటీసు ఎందుకు ఇవ్వలేదని మౌనమెందుకు వహిస్తున్నారన్నారు. మాదవ్‌ను సస్పెండ్ చేయకుండా సిఎం జగన్ ఎందుకు వెనుకేసుకొస్తున్నారని అతనిని సమర్థిస్తూ రాష్ట్రాన్ని జగన్ అబాసుపాలు చేస్తున్నారని, గోరంట్లను పదవి నుంచి ముఖ్యమంత్రి తొలగించే వరకూ టిడిపి నిరసనలు తెలుపుతుందని హెచ్చరించారు. టిడిపి కౌన్సిలర్లు వైదేహి, శైలజా సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యనభ్యసించాలి

### – ఎంపీ బెల్లాన చంద్ర శేఖరరావు




**బొబ్బిలి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతీ ఒక్క విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని ఎంపి బెల్లాన చంద్ర శేఖరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జగన్న విద్యాదీవెన చెక్కులు లబ్ధిదారులకు అందించే కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌రావు, ఎంపిపి శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ శాంతికుమారి, ఎబిసి డబ్ల్యుఎ శ్యామలకుమారి, డిటిడబ్ల్యుఒ డి.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ పేద విద్యార్థి ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం సాయంతో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు కింది ఇప్పటివరకు 11715 కోట్లు అందజేసినట్లు తెలియజేసారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రతీ మూడు మాసాలకు తల్లులు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. 2022 ఏప్రిల్-జూన్ త్రైమాసకానికి 694 కోట్లు సిఎం వైఎస్ జగన్‌మోనరెడ్డి గురువారం తల్లుల ఖాతాలకు జమచేసారన్నారు. ఈ విధంగా 11 లక్షల మందికి లబ్ధిచేకూరిందన్నారు.

## వెలుగు ఆధ్వర్యంలో దేశభక్తిపై ర్యాలీలు

**కొత్తవలస, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లా డిఆర్‌డిఎ వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో కొత్తవలస మండలంలో వెలుగు ఆధ్వర్యంలో స్వయం సంఘాల ద్వారా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించినట్లు వెలుగు ఎపిఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం చిన్నపాలెం పంచాయతీలో సర్పంచ్ రంగుడు పద్మలత ఆధ్వర్యంలో సదస్సు ర్యాలీ ఏర్పాటు చేయడం జరిగింది.

## న్యాయసేవలపై విద్యార్థుల ప్రచారం




**కురుపాం, ఆగస్టు 11 ప్రభాతవార్త :** అజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం కురుపాం జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మేజి స్ట్రేట్ ఇ.ఆంజనేయులు ఆధ్వర్యంలో కురుపాం పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా కోర్టు కాంప్లెక్స్ వరకు కొనసాగింది. న్యాయశాఖ పరంగా ప్రజలకు అందే న్యాయసేవలపై విద్యార్థులు ప్ల కార్డులు పట్టుకుని కొనుగోలు ఇచ్చారు. కోర్టు ఆవరణలో న్యాయమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. దేశభక్తి కలిగి ఉండే పిల్లలు భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో స్థిరపడగలరని అన్నారు. న్యాయసేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ఇ.ఆంజనేయులు, న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, వి.కుమారస్వామి, కె.అశోక్‌కుమార్, స్వచ్ఛంద సేవకులు జి.వెంకటరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు రామారావు, నాయుడు, శ్రీనివాసరావు, బుజంగరావు, కిశోర్ కుమార్, కోర్టు సిబ్బది పాల్గొన్నారు.

## ప్రైవేటు వ్యాపారస్తులకే ఖాకీల సేవలు!

### – ప్రజల సొమ్ముతో ప్రైవేటు విధులు!



**విజయనగరం (ప్రభాత వార్త) :** ట్రాఫిక్ నిర్వహణలో పోలీసుల తీరు విమర్శలకు గురవుతోంది. పోలీసుల వ్యవహార సరళిని ప్రజలు బహాటంగానే తప్పుబడుతున్నారు. కార్పొరేట్ సంస్థలకు, షాపులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. కార్పొరేట్ షాపులకు పోలీసులు రక్షణ కల్పిస్తున్నారంటూ జనం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జనం కోసం కాకుండా కొంతమందికి అనుకూలంగా పోలీసులు వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**పోలీసుల గులాం!**

కాగా విజయనగరంలోని పలు ప్రముఖ షాపులకు, కార్పొరేట్ వాణిజ్య సంస్థలకు పోలీసులు కొమ్ము కాస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఒకసారి అలా బహిరంగ మార్కెట్‌లోకి, ప్రధాన రహదారుల్లోకి వెళ్లి చూస్తే ఇది నిజమనిపించకపోదు. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న రిలయన్స్ ట్రెండ్స్, వెంకటలక్ష్మి థియేటర్ కూడలి వద్ద ఉన్న సీఎంఆర్ షాపింగ్‌మాల్స్, స్వీట్ ఇండియా వద్ద పోలీసులు అనధికారికంగా విధులు నిర్వ హిస్తూ ఆ షాపులకు, వ్యాపారాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. కొందరు పోలీసులైతే రద్దీ సమయంలో అక్కడే ఉండి వాహన రాకపోకలను నియంత్రిస్తూ, ఆ షాపులకు వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని చూపిస్తూ తమవంతు సహాయం చేస్తున్నారన్న ప్రజల విమర్శల్లో నిజం లేకపోలేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న రిలయన్స్ ట్రెండ్స్ సముదాయం వైపు వెళ్లేందుకు ఒకవైపు నుంచే అవకాశం ఉంది. ఆర్టీసీ ఔట్‌గేటు వైపు నుంచి రిలయన్స్ ట్రెండ్స్ వైపు ఏ వాహనం వెళ్లినా పోలీసులు అడ్డుచెప్పక పోవడం గమనార్హం. వారు షాపులోకి వెళ్లేందుకు అనుకూలంగా ట్రాఫిక్ పోలీసులు వ్యవహ రిస్తుండడం గమనించవచ్చు. అదే సామాన్యుడెవరైనా సైకిల్‌పైనో, ద్విచక్రవాహనంపైనో యామరుపాటుగా అటువైపునకు వెళితే ఫొటో తీసి కేసు రాస్తున్నారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ దగ్గర కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అంతేకాదు ప్రధాన బజారులో ఉన్న పలు షాపుల విషయంలో కూడా పోలీసులు ఇలాగే వ్యవహరిస్తున్నారు. ఆ షాపులకు వచ్చే వాహనాలకు సహకరిస్తున్న పోలీసులు ఇతరత్రా వచ్చినవారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. షాపుల ముందు ఎలాంటి తోపుడుబళ్లు, పార్కింగ్ లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

**ప్రజల సొమ్ముతో ప్రైవేటుకు చాకిరీ!**

ప్రజలు చెల్లించే పన్నుని జీతాలుగా తీసుకుంటున్న పోలీసులు ప్రైవేటు వ్యాపారస్తులకు చాకిరీ చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ప్రజలు బహిరంగంగానే పోలీసుల తీరును దుయ్యబడుగుతున్నారు. ముఖ్యంగా బంగారం షాపులకు సేవచేసేందుకు పోలీసులు ఎందుకనో తహతహలాడుతుంటారు. వారు అడిగినా అడగకపోయినా వారి వ్యాపారానికి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. బంగారం షాపుల ముందు వాహనాలను పార్కింగ్ చేయనివ్వడం లేదు. అక్కడే ఉండి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాపుకాయడంపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. సామాన్యులపైన ఇంతెత్తున ఎగిరిపడే పోలీసులు బంగారం షాపుల ముందు వినయవిధేయరామ లాగా వ్యవహరించడం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. పోలీసుల అవసరాలను బంగారం షాపులవారు తీరుస్తుండడం, ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన ఆర్థిక సహాయం చేయడం సంగతి ఎలా ఉన్నా, ప్రజల నుంచి పన్నుల రూపంలో జీతం తీసుకుంటూ కేవలం వ్యాపారస్తులకే కొమ్ము కాయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


**ఆటోలకు ఫ్రీ లైసెన్స్!**

ప్రధాన రహదారుల్లో తోపుడుబళ్లు, ఆటోలకు యథేచ్ఛగా అవకాశం కల్పించిన ఘనత పోలీసులకే దక్కుతుంది. ప్రధాన రహదారిలో ఇరువైపులా తోపుడుబళ్లు ఉంటాయి. ఆటోలు ఎక్కడబడితే అక్కడ ఆపిఉంచుతారు. ఏ ఆటో ఎటువైపునుంచి ఎటు తిరుగుతుందో దేవుడికి కూడా తెలియదు. సామాన్య, మధ్యతరగతి కుటుంబీకులు ద్విచక్రవాహనంపై షాపింగ్‌కు వెళితే నరకం చూడాల్సిందే. ఏ షాపు ముందు ఖాళీ ఉండదు. తోపుడుబళ్లు, చిరువ్యాపారులు ఆక్రమించుకుని ఉంటారు. ఎక్కడ వాహనం పెట్టాలో తెలియక సతమతమవుతుంటే పోలీసులు వెనుకనుంచి వచ్చి ఫొటో తీసి ఫైన్ విధిస్తున్నారు. చెప్పినా పట్టించుకోవడం లేదు. తోపుడుబళ్లవారిని, చిరువ్యాపారులను ఏమీ అనరు. ఆటోల విషయంలో అయితే పోలీసులు చేతులెత్తేసినట్లే కనబడుతోంది. షాపింగ్ చేసేందుకు వచ్చిన ప్రజలు పార్కింగ్ చూపించాల్సిన బాధ్యత పోలీసులకు లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పార్కింగ్ అవకాశం లేక ప్రజలు షాపింగ్‌కు రాలేకపోతే వ్యాపారులు కూడా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుందన్న సూక్ష్మాన్ని పోలీసులు ఎందుకు గ్రహించరో అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయినా ప్రజల కోసం పనిచేయాల్సిన పోలీసులు ప్రైవేటు వ్యాపారస్తుల కోసం పనిచేయడం ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్రైవేటు వ్యాపారస్తులకు పనిచేయాలనుకుంటే జీతభత్యాలు వారిదగ్గరే తీసుకోవచ్చుకదా అని జనం అంటున్నారు. జనం కోసం ఆలోచించి, జనానికి అనుకూలంగా వ్యవహరించాల్సిన పోలీసుల తీరు మార్చుకోవాలని ప్రజలు హితవు పలుకుతున్నారు. పోలీసు అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై జనం విమర్శలు గుప్పిస్తున్నారు.

## చదువే గొప్ప ఆస్తి : జెడ్పీ ఛైర్మన్

### – 50 వేల మంది తల్లుల ఖాతాల్లో విద్యా దీవెన

### – రూ.26.85 కోట్లు జమచేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి



**విజయనగరం (ప్రభాత వార్త) :** చదువే పిల్లలకు మనమిచ్చే గొప్ప ఆస్తి అని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి విద్యాదీవెన సొమ్మును, విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారితో కలిసి కలెక్టరేట్ ఆడిటోరియంలో లైవ్ టెలికాస్ట్ ద్వారా తిలకించిన అనంతరం జెడ్పీ ఛైర్మన్ మీడియాతో మాట్లాడారు. చదువు ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందన్నది ముఖ్యమంత్రి నమ్మకమన్నారు. అందుకే రాష్ట్రంలో విద్యారంగ సంస్కరణలకు సీఎం పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టి, విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక లాంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి నేరుగా తల్లుల ఖాతాల్లో ఫీజులను జమచేస్తూ విద్యార్థులకు సీఎం అండగా నిలుస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఎంతగానో కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యాదీవెనకు సంబంధించిన చెక్కును కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జెడ్పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారతాధికారి పి.రత్నం, ఇతర అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

